ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి చెన్నై కార్యాలయం
చిరునామా మార్పు..
"జి.4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెంబరు:40,
న్యూనెంబర్: 35, విజయరాఘవరోడ్డు, టి.నగర్, చెన్నై-600 017"
చిరునామాలో మంగళవారం నుంచి చెన్నై కార్యాలయం పని చేయనుంది.
పాఠకులు గమనించగలరు.

ఈనాటి ఈ బంధం ఏనాటిదో...!

అనాథ యువతిని ఆదరించి, అన్నీతానై వివాహం జరిపించిన ఐఏఎస్ అధికారి



వరుడి చేతికి మంగళసూత్రం అందిస్తున్న దినేష్ పొన్‌రాజ్

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయి, మానసిక వైకల్యం కలిగిన సోదరితో పూరిపాకలో నివసిస్తూ, కష్టాలకడలిలో కొట్టుమిట్టాడిన ఓ యువతిని చూసి చలించి, చేరదీసి, నివసించేందుకు ఓ ఇంటిని కేటాయించడమే కాకుండా, వారికి ధైర్యం చెబుతూ........ ఆమెలో ఆత్మస్థయిర్యాన్ని నింపి, తండ్రిలా అండగా నిలిచి, ఆమెకు ఘనంగా పెళ్లి జరిపించిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి దాతృత్వాన్ని మనసారా మెచ్చుకుంటున్నారు రెట్టవయల్ గ్రామస్థులు. ఇంతకీ ఆ ఐఏఎస్ అధికారి ఎవరంటే గతంలో తంజావూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖ చైర్మన్‌గా ఉన్న దినేష్ పొన్‌రాజ్ ఆలివర్.

తంజావూరు కలెక్టర్‌గా దినేష్ పొన్‌రాజ్ పనిచేస్తున్నప్పుడు పేరావుర్ని సమీపంలోని రెట్టవయల్ గ్రామానికి చెందిన పాండిమీనా అనే యువతి తల్లిదండ్రులను కోల్పోయి మానసిక వైకల్యంతో బాధపడుతున్న సోదరిని సంరక్షిస్తూ ఆమె పడే కష్టాలను స్వయంగా గమనించి చలించిపోయారు. ఆ యువతికి చేతనైనంత సాయం చేసి ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. పూరిపాకలో ఉన్న ఆమెకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.2.40 లక్షలు, తన సొంత డబ్బు రూ.1.50లక్షలు, లయన్స్ క్లబ్ ద్వారా రూ.1.50లక్షలను సమకూర్చి కొత్త ఇల్లు నిర్మించి ఇచ్చారు. అప్పటికే పాండిమీనా నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది. కలెక్టర్ ఇలా ఉదారంగా చేసిన సహాయానికి ఆమె చలించిపోయింది. అప్పటి నుండి దినేష్‌ను ఆమె 'నాన్నా' అనే పిలవడం ప్రారంభించింది.

ఆ తర్వాత ఆయన రిజిస్ట్రేషన్‌ల శాఖ అధ్యక్షుడిగా పదోన్నతిపై చెన్నైకి బదిలీ అయ్యారు. అప్పటికే ఆయన తరచూ పాండిమీనా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. కొద్ది నెలలకు ముందు ఆయన పాండిమీనాకు వివాహం జరిపించాలని అనువైన వరుడికోసం అన్వేషించారు. చివరకు అభిమన్యు అనే యువకుడితో ఆమెకు వివాహం ఖరారు చేశారు. సోమవారం ఉదయం పేరావుర్నిలో పాండిమీనా, అభిమన్యుల వివాహాన్ని కూడా ఆయనే దగ్గరుండి జరిపించారు. పాండిమీనాకు తండ్రిలాగే తన సొంత ఖర్చుతో సారె వస్తువులను కొని పెళ్ళిమంటపంలోనే సమర్పించారు. పెళ్ళయ్యాక పాండిమీనా అత్తవారింటికి వెళ్తుంటే దినేష్ పొన్‌రాజ్ కన్నతండ్రిలాగే కంటతడి పెట్టుకున్నారు. ఆ దృశ్యాన్ని చూసిన పాండిమీనా కుటుంబీకులు, వరుడి కుటుంబసభ్యులే కాకుండా ఊరి ప్రజలంతా ఆశ్చర్యపోయారు.



నూతన వధూవరులతో ఐఏఎస్ అధికారి దినేష్ పొన్‌రాజ్

వాయు కాలుష్యానికి చెక్

ఎలక్ట్రిక్ సిటీ బస్ సర్వీసుల ప్రారంభం





ఎలక్ట్రిక్ సిటీ బస్సులను ప్రారంభించి, ఓ బస్సులో లేడీ కండక్టర్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్, చిత్రంలో రవాణాశాఖ మంత్రి శివశంకర్ తదితరులు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో వాయు కాలుష్యాన్ని నిరోధించే దిశగా మహానగర రవాణా సంస్థ తొట్టతొలిసారిగా ఎలక్ట్రికల్ లో ఫుట్‌బోర్డు సిటీ బస్సులను సోమవారం ఉదయం ప్రారంభించింది. వ్యాసార్పాడి డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 120 ఎలక్ట్రిక్ సిటీ బస్సులను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత రూ.47.50 కోట్లతో వ్యాసార్పాడి ఎలక్ట్రికల్ బస్ డిపో కూడా ఆయన ప్రారంభించారు. రూ.207 కోట్లతో కొనుగోలు చేసిన ఈ ఎలక్ట్రిక్ సిటీ బస్సులు నగరవాసులకు ప్రయాణంలో కొత్త అనుభూతి కల్పిస్తుందని సీఎం తెలిపారు. ఈ బస్సులకు ఒకసారి ఛార్జ్ చేస్తే 200 కి.మీ. వరకు ప్రయాణించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి శివశంకర్, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు ఆర్డీ శేఖర్, ఆర్, మూర్తి, జేజే ఎబినేజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ బస్సులో సీటు కింద ఏర్పాటు చేసిన మొబైల్ చార్జింగ్ యూనిట్

ఈ బస్సులో ప్రత్యేకాంశాలు...

సెల్‌ఫోన్ ఛార్జింగ్ సదుపాయం... సీట్ బెల్ట్

- ఈ ఎలక్ట్రిక్ బస్సుల ఫుట్‌బోర్డు నేల నుండి 400 మి.మీ. ఎత్తే ఉంటుంది. దివ్యాంగులు సులువుగా ఈ బస్సెక్కడానికి వీలవుతుంది.
- దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన సీటింగ్ సదుపాయం కూడా ఉంది.
- ఈ బస్సులో సీట్లలో కూర్చున్నవారికి నిలబడి ప్రయాణించేవారికి మధ్య గ్యాప్ ఉంటుంది.
- ఈ బస్సు ముందు, వెనుక సీసీ కెమెరాలున్నాయి.
- 2బి నెంబర్ రూటు - కన్నదాసన్ నగర్ నుంచి ఎంకేబీ నగర్ - సత్యమూర్తి నగర్, - మింట్ - ఎలిఫెంట్ గేట్, సెంట్రల్ - పల్లవన్ రోడ్డు - మన్రో విగ్రహం - అన్నాస్క్వయ్ మీదుగా కన్నదాసన్ నగర్ వరకు 10 బస్సులు నడుపుతారు.
- సి33 నెంబర్ రూటు : కన్నదాసన్ నగర్ - బీచ్ రైల్వేస్టేషన్ - బ్రాడ్వే, నెహ్రూ స్టేడియం, పుళియంతోపు, మూలకడై, వ్యాసార్పాడి మీదుగా కన్నదాసన్ నగర్ వరకు 5 బస్సులు నడుపుతారు.
- సి64 నెంబర్ రూటు : కన్నదాసన్ నగర్ నుండి వ్యాసార్పాడి - శర్మానగర్, జమాలియా - వల్లాలర్ నగర్ - ఎంకేబీ నగర్ మీదుగా కన్నదాసన్ నగరవరకు 5 బస్సులు,
- 18ఎ నెంబర్ రూటు : బ్రాడ్వే నుండి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు 20 బస్సులు,
- 37 నెంబర్ రూటు : వళ్లాలగర్ నగర్ నుంచి పూందమల్లి వరకు 10 బస్సులు
- 46జి నెంబర్ రూటు : ఎంకేబీ నగర్ నుంచి కోయంబేడు బస్ స్టేషన్ వరకు 10 బస్సులు
- 57 నెంబర్ రూటు : వల్లాలర్‌నగర్ నుండి రెడ్‌హిల్స్ వరకు 10 బస్సులు
- 57ఎక్స్ నెంబర్ రూటు : వల్లాలర్‌నగర్ నుండి పెరియపాళయం దాకా పది బస్సులు
- 164ఇ నెంబర్ రూటు : పెరంబూరు - మనలి వరకు పది బస్సులు
- 170టిఎక్స్ నెంబర్ రూటు : ఎంకేబీ నగర్ నుండి కిలాంబాక్కం బస్‌టెర్మినల్ వరకు 20 బస్సులు
- 170 సి నెంబర్ రూటు : తిరువిక నగర్ నుండి గిండి ఎస్టేట్ వరకు 10 బస్సుల.
- ఒకసారి ఛార్జింగ్ చేస్తే 200 కి.మీ ప్రయాణం
- మొత్తం 39 సీట్లకు సీట్ బెల్ట్
- అన్ని సీట్ల కింది భాగంలో ఛార్జింగ్ పాయింట్లు
- ప్రయాణికుల సంఖ్య లెక్కించేలా ప్రత్యేక కెమెరా
- 6 సీసీ కెమెరాలు
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సీటు
- 13 ప్రాంతాల్లో అత్యవసర కిటికీలు
- దివ్యాంగులు, వృద్ధులను మూడు చక్రాల కుర్చీలతో ఎక్కించేలా లో ఫ్లోర్ సదుపాయం
- బస్టాప్ వివరాలతో ఎల్ఈడీ స్క్రీన్

దివ్యాంగులకు, వృద్ధులకు

నేటినుంచి ఇంటి వద్దకే రేషన్



చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని చెన్నై సహా పది జిల్లాల్లో ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 2.25 కోట్ల బియ్యం కార్డుదారులకు బియ్యం, గోధుమలు ఉచితంగా, కందిపప్పు, పామాయిల్, చక్కెర తదితర నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందిస్తున్నారు. ఈ సరుకులు పొందేందుకు రేషన్ కార్డులో పేరు ఉన్న ఓ వ్యక్తి రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్‌లో వేలిముద్ర నమోదు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో, దివ్యాంగులు, వృద్ధులు రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో, వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం చెన్నై సహా 10 జిల్లాల్లో తొలివిడతగా ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలుకానుంది. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలోని రేషన్ కార్డులు అందరికీ సరుకులందేలా చర్యలు చేపట్టామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనే ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, 70 ఏళ్లు దాటిన వృద్ధులు, 18 ఏళ్లలోపున్న వారి వివరాలు సేకరించామన్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సిబ్బంది ద్వారా సరుకులు అందించే పథకం మంగళవారం నుంచి ఎంపిక చేసిన 10 జిల్లాల్లో తలా రెండు తాలూకాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేయనుందని, త్వరలో ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

5 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో మంగళవారం నుండి 5వ తేది వరకు కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... నైరుతి రుతుపవనాలు ప్రభావంతో పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో, పశ్చిమ గాలుల వేగంలో నెలకొన్ని మార్పుల కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షం, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 1-3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములతో కూడిన తేలికపాడి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

17 శాతం అదనపు వర్షపాతం...

రాష్ట్రంలో నైరుతి రుతుపవన వర్షాలతో శనివారం వరకు సాధారణం కన్నా 17 శాతం వర్షపాతం నమోదైంది. ఆ ప్రకారం, 46 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 59.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాజధాని నగరం చెన్నైలో 64.6 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 14 శాతం అదనంగా 73.8 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పరందూరు విమానాశ్రయానికి స్థల సేకరణ.....

ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.2.51 కోట్లు



టి.నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పరందూరు విమానాశ్రయ ప్రాజెక్టు కోసం సేకరించనున్న స్థలాలకు మార్కెట్ రేటు ప్రకారం ధర చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ మేరకు ఎకరాకు రూ.35లక్షల నుండి రూ.2.51 కోట్ల వరకు చెల్లించనుందని, ఈ విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. కాంచీపురం జిల్లా పరందూరు, దాని చుట్టుపక్కల ఉన్న 13 గ్రామాలకు చెందిన 5,746 ఎకరాల్లో గ్రీన్ ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఓ వైపు పరందూరు, ఏకనాపురం తదితర గ్రామాల ప్రజలు విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ వెయ్యి రోజులకు పైగా ఆందోళనలు జరుపుతుండగా మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణ పనులను వేగంగా చేపడుతోంది. ఆ ప్రకారమే స్వాధీనం చేసుకోనున్న స్థలాలకు సంబంధించిన మార్గదర్శక ధరల కంటే అదనంగా చెల్లించడానికి సిద్ధమవుతోంది. స్థలాలకు సంబంధించిన నష్టపరిహారంతోపాటు 25 శాతం ప్రోత్సాహక నగదు కూడా కలిపి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో విమానాశ్రయ ప్రాజెక్టు కోసం సేకరించనున్న స్థలాల ధరల నిర్ణయానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర పెట్టుబడుల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్ విడుదల చేశారు. పరందూరు వద్ద గ్రీన్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి 3,774.01 ఎకరాల ప్రైవేటు భూములను, 1972.17 ఎకరాల ప్రభుత్వ భూములను సేకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు భూములకు ధర నిర్ణయించేందుకు జిల్లా, రాష్ట్రస్థాయిలో సంప్రదింపుల (చర్చల) కమిటీలు కూడా ఏర్పాటయ్యాయని వివరించారు. ఆ ప్రకారం జిల్లా స్థాయి కమిటీ స్థల యజమానులతో చర్చలు జరిపి, ధర ప్రతిపాదించిందని, ఆ ప్రతిపాదనలను కాంచీపురం జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయి కమిటీ పంపారని తెలిపారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఆ భూములకు చెల్లించాల్సిన ధర నిర్ధారించిన తర్వాత ప్రతిపాదనలను ప్రభుత్వ పరిశీలనకు పంపింది. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన మీదట రాష్ట్ర ప్రభుత్వం ఎకరా ప్రాతిపదికగా నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించింది. ఆ మేరకు రూ.5లక్షల నుండి రూ.17లక్షల ధర పలుకుతున్న ఎకరా భూమికి ప్రభుత్వం ప్రోత్సాహక నగదుతోపాటు రూ.35లక్షల నుండి రూ.60లక్షల వరకు చెల్లించనుంది. అదే సమయంలో సాగుచేయడానికి వీలులేని 374.53 ఎకరాల్లో ఎకరాకు కనీసపక్షంగా రూ.40లక్షల నుండి రూ.60లక్షల దాకా నష్టపరిహారం చెల్లించేలా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను ఇదివరకే వెలువరించారు. అదే విధంగా మార్గదర్శక విలువ రూ.17లక్షల కంటే అధికంగా ఉన్న 996 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.2.51కోట్ల మేరకు నష్టపరిహారంగా చెల్లించనుంది.

డీమాంటి సాలైకు ఎంఎస్‌వీ పేరు

● పలువురు నేతల విగ్రహాల స్థల మార్పిడి ● కార్పొరేషన్ తీర్మానం



కార్పొరేషన్ సమావేశంలో మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్ తదితరులు

అడయార్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడిప్పాక్కంలోని డీమాంటి సాలైకు ప్రఖ్యాత సినీ సంగీత దర్శకుడు ఎం.ఎస్.విశ్వనాథన్ (ఎంఎస్‌వీ) పేరు పెట్టనున్నారు. ఈ మేరకు చెన్నై నగర పాలక సంస్థ సమావేశంలో ఓ తీర్మానం చేశారు. చెన్నై కార్పొరేషన్ సమావేశంలో సోమవారం మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగింది. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. మడిపాక్కంలోని డీమాంటి కాలనీ సాలైకు ఎంఎస్ విశ్వనాథన్ పేరు పెట్టాలని తీర్మానించారు. అదేవిధంగా కీల్పాక్కంలోని వాట్లస్ రోడ్డుకు ఎస్రా సర్గుణం పేరు పెట్టాలని నిర్ణయించారు. అలాగే, కార్పొరేషన్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, 300 తాత్కాలిక ఉపాధ్యాయులు, 206 మంది పీజీ గ్రేడ్ టీచర్లను నియమించాలని తీర్మానించారు. అలాగే, జీఎన్ చెట్టి రోడ్డులో ఉన్న కలైవానర్ ఎన్.ఎస్.కృష్ణన్ విగ్రహాన్ని కలైవానర్ ఆడిటోరియం ప్రాంగణంలో, కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని ఎగ్మోర్ మ్యూజియంలోని గ్రంథాలయం ముఖద్వారం వద్ద, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని తిరువొట్రియూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న చెన్నై కార్పొరేషన్ పార్కులో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మణలి జోన్‌లో రూ.12 కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయక, సంక్షేమ సెంటర్ ఏర్పాటు చేయాలని, దేవనేయ పావనార్ విగ్రహాన్ని తమిళ భాషాభివృద్ధి సంచాలక కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేలా జిల్లా కలెక్టర్‌కు ఎన్‌వోసీ ఇవ్వాలనే తీర్మానం సహా మొత్తం 110 తీర్మానాలను చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా, ఈ సమావేశంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కేవలం 40 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరుకావడం గమనార్హం.

కూవత్తూరులో దారుణం పెట్రోల్ బంక్ యజమాని హత్య



ఈసీఆర్ రోడ్డులో రాస్తారోకో చేస్తున్న బంధువులు, స్థానికులు. ఇన్‌సెట్‌లో మోహన్‌రాజ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూవత్తూరు సమీపంలో పెట్రోలు బంక్ యజమానిని గుర్తుతెలియని నలుగురు దుండగులు మారణాయుధాలతో దాడిచేసి దారుణంగా హతమార్చారు. కూవత్తూరు పేట ప్రాంతానికి చెందిన మోహన్‌రాజ్ (50) కల్పాక్కం సమీపంలోని కాత్తాంగడై ఈసీకోస్ట్‌రోడ్డులో పెట్రోలు బంక్ నడుపుతున్నారు. ఆదివారం రాత్రి బంక్ మూసి వేసి బైకులో ఇంటికి బయలుదేరారు. ఆ సమయంలో కాత్తాంగడై ప్రాంతంలో కారులో వేచి ఉన్న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో ఆయనను చుట్టుముట్టి దాడిచేసి కారెక్కి పారిపోయారు. వంటి నిండా కత్తిపోట్లకు గురైన మోహన్‌రాజ్‌ను ఆ ప్రాంతంలో దుకాణాలు నడుపుతున్న కొందరు వ్యాపారులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. సమాచారం గురించి తెలుసుకున్న మహాబలిపురం డీఎస్పీ అరివళగన్, కల్పాక్కం సీఐ అన్నాదురై ఇతర పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపారు. మోహన్‌రాజ్ ప్రతిరోజూ పెట్రోలు బంక్ మూసివేసి కారులోనే ఇంటికి వెళ్తుండేవారని, ఆదివారం రాత్రి ఆయన బైకులో వెళ్లటంతో హంతకులు మార్గమధ్యంలో మాటువేసి ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మోహన్‌రాజ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలు కారణమా? లేక స్థలం తగాదాలు కారణమా? అని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యను ఖండిస్తూ సోమవారం ఉదయం మోహన్‌రాజ్ కుటుంబీకులు, స్థానికులు ఈసీఆర్‌లో రాస్తారోకో జరిపారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆయుర్వేద, హోమియో విభాగాల్లో నియామకాలు



ఆయుర్వేద, సిద్ధ, యునానీ వైద్య విభాగాల్లో సహాయకులుగా నియామక పత్రాలు అందుకున్న వారితో సీఎం స్టాలిన్

చెన్నై, జూన్30(ఆంధ్రజ్యోతి): సిద్ధ, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి విభాగాల్లో సహాయకుల పోస్టులకు ఎంపికైన 57మందికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. చెన్నై సచివాలయంలో ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణియన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, భారతీయ వైద్య హోమియోపతి విభాగం కమిషనర్ ఎం. విజయలక్ష్మి వైద్య సిబ్బంది పరీక్షల విభాగం చైర్‌పర్సన్ పి.ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

అమలుకు వచ్చిన 'వాటర్ బెల్'

పెరంబూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు నిర్ణీత సమయంలో నీరు తాగేలా 'వాటర్ బెల్' ప్రక్రియ సోమవారంనుంచి అమల్లోకి వచ్చింది. ఆ ప్రకారం, ఉదయం 11, మధ్యాహ్నం 1, 3 గంటలు అని మూడుసార్లు వాటర్ బెల్ మోగించనున్నారు. ఒక్కో సమయంలో విద్యార్థులు నీరు తాగేలా 2 నుంచి 3 నిమిషాలు కేటాయించారు. ఆ సమయంలో విద్యార్థులు తరగతి గదుల నుంచి బయటకు వెళ్లకుండా, తాము కూర్చున్న స్థలంలోనే నీరు తాగాలని, విద్యార్థులు పాఠశాలలకు వాటర్ బాటిల్ తీసుకురావాలని మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ జారీచేసింది.

9,10 తేదీల్లో తిరువారూరు జిల్లాలో సీఎం పర్యటన

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లాలో ఈ నెల 9,10 తేదీల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు జిల్లాల్లో సక్రమంగా అమలవుతున్నాయా? అనే విషయమై సీఎం జిల్లాల వారీగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తిరువారూరులో పర్యటించనున్న ముఖ్యమంత్రి, పూర్తయిన పథకాలు ప్రారంభించడం, కొత్త పథకాలకు శంకుస్థాపన, పలు శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందించనున్నారని మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు.

నేటినుంచి పాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని మద్రాసు వెటర్నరీ వైద్య కళాశాలలో పాల ఉత్పత్తుల తయారీ శిక్షణ ఇవ్వనున్నారు. మంగళవారం నుంచి 4వ తేది వరకు జరుగనున్న శిక్షణలో, పాలు, పాల ఉత్పత్తుల పోషక విలువలు, నాణ్యత నియంత్రణ పరీక్ష, పాలలో కొవ్వు అంచనా, కొవ్వు లేని ఘనపదార్థాలు, మసాలా మజ్జిగ, రుచికరమైన పాల తయారీ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా ఫీజుగా రూ.1,700 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు 9444509309, 9841390169 అనే నెంబర్లు సంప్రదించవచ్చని కళాశాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగుల నుంచి లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవద్దు

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ సహాయం పొందుతున్న దివ్యాంగుల నుంచి లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవద్దని దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆరు రకాల సహాయం అందజేస్తోంది. తమిళనాడు ఈ-గవర్నెన్స్ ద్వారా డేటా సేకరించి, అర్హత కలిగిన లబ్ధిదారులకు సహాయం అందజేస్తున్నారు. అలాంటి సహాయాలు పొందుతున్న దివ్యాంగుల నుంచి జీవిత ధ్రువపత్రం పొందవద్దని కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మెట్రోలో పదేళ్లలో 39 కోట్ల మంది ప్రయాణం

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోరైలు సేవలు 2015 జూన్ 29వ తేది ప్రారంభమయ్యాయి. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు మెట్రో రైలు సేవలు ప్రధానంగా ఉన్నాయి. ప్రతిరోజు వేలాది మంది మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో, చెన్నై మెట్రో రైలు ప్రారంభించి పదేళ్లు పూర్తయింది. 2015 జూన్ 29వ తేది కోయంబేడు-ఆలందూర్ మధ్య మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో రైలు సేవలు ప్రారంభించిన పదేళ్లలో 39 కోట్ల మంది ప్రయాణించారు. మెట్రోరైలు మొదటి విడత ప్రాజెక్టుకు ప్రయాణికుల ఆదరణ లభించడంతో, రెండో విడత ప్రాజెక్ట్ 118.9 కి.మీ మేర రూ.63,246 కోట్లతో మూడు మార్గాల్లో ఏర్పాటుచేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది.

ఆన్‌లైన్‌లో నగదు మోసానికి పాల్పడిన నలుగురి అరెస్ట్

పెరంబూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన నలుగురిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. టీనగర్ ప్రాంతానికిచెందిన పారిశ్రామికవేత్త కిషోర్‌కు కొద్దినెలల క్రితం వాట్సాప్ ద్వారా వచ్చిన మెసేజ్‌లో... వాట్సాప్‌గ్రూపులోచేరితే, తామిచ్చే సూచన ద్వారా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు పొందవచ్చని ఉంది. ఈ మెసేజ్ నమ్మిన అశోక్, వాట్సాప్‌లో పేర్కొన్న పలు బ్యాంక్ ఖాతాలకు పలు విడతలుగా రూ.2.26 కోట్లు పంపించారు. కానీ, మెసేజ్‌లో పేర్కొన్న విధంగా ఆదాయం లభించలేదు.

1,200 మందికి ఒక పోలింగ్ కేంద్రం

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికలకు సుమారు 68వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య సక్రమంగా లేక, ఒక కేంద్రంలో 1,700 మంది ఓటర్లు ఉండగా, మరో కేంద్రంలో 900 మంది మాత్రమే ఉంటున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన కేంద్ర ఎన్నికల సంఘం, ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని 1,200 మంది ఓటర్లతో ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. అందుకు, అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాల్సి ఉండగా, ఈ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేసే పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

దుస్థితిలో ఎట్టయపురం 'భారతియార్ ఇల్లమ్'

● నిధులున్నా సాగని మరమ్మతు పనులు




కూలిపోయిన భారతియార్ ఇల్లమ్ పైకప్పు - ప్రవేశద్వారం వద్ద కొయ్యల సారవ

టి.నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమిళ రాజకీయ నాయకులు, సాహితీ వేత్తలు, కవులు, తాజాగా కలం చేతపడుతున్న యువకులు తమిళ మహాకవి భారతియార్‌ను స్ఫూర్తిగా తీసుకుని, నిత్యం ఆరాధిస్తుంటారు. ఆ మహాకవి కవితలను తమ ప్రసంగాలలో, రచనల్లో ఉటంకిస్తుంటారు. ఉత్తరాది నుంచి వచ్చే జాతీయ పార్టీల నాయకులు, ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సైతం తమ ప్రసంగాల్లో భారతియార్ కవితను పఠించడమో, కనీసం ఆయన పేరునైనా ప్రస్తావించడం ఆనవాయితీ. ఇంతటి కీర్తిని సంపాదించుకున్న ఆ మహాకవి భారతియార్ జన్మించిన ఎట్టయపురం నివాసం పట్టించుకునేవారు లేక పాలకుల నిర్లక్ష్యం కారణంగా గత మూడు మాసాలుగా దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మూడు శతాబ్దాల నాటి ఆ చారిత్రక నివాసాన్ని మరమ్మతు చేయడానికి పాలకులు పట్టించుకోలేదు.

కూలిన పైకప్పు...

ఎట్టయపురం నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డు పెరుమాళ్ కోవిల్ వీధిలో ఉంది భారతీయార్ జన్మించిన భవనం. 1973లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ఈ భవనాన్ని ప్రభుత్వం తరపున కొనుగోలు చేసి, దానికి మరిన్ని సొబగులతో పునర్నిర్మించి స్మారక స్థలంగా ప్రకటించి ప్రారంభించారు. ఈ 'భారతీయార్ ఇల్లమ్'లో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం వరకు సందర్శకులకు అనుమతిస్తారు. ఆ భవనంలోనే గ్రంథాలయం కూడా ఉంది. గత బడ్జెట్ సమావేశాల్లో ఎట్టయపురంలోని భారతియార్ ఇల్లమ్ సహా 17 ప్రాచీన కట్టడాలను వాటి పాత అందాలకు భంగం కలిగించని విధంగా పునర్నిర్మించేందుకు రూ.150 కోట్ల మేరకు నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ నేపథ్యంలో మార్చి 25 సాయంత్రం భారతీయార్ ఇల్లమ్ సందర్శకులను ఆహ్వానించే ప్రాంతంపై అంతస్థు పైకప్పు విరిగి కూలిపడింది. దీంతో దిగువ అంతస్థు పైకప్పు కూడా విరిగి పడ్డాయి. ఈ సంఘటనలో విజిటర్స్ రూమ్‌లోని కుర్చీలు, బల్లలు తదితర సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనితో ఆ భవనాన్ని ఎవరూ సందర్శించకుండా నిషేధించారు.

నిధులు కేటాయించినా ...

ఆ భవనాన్ని కోటి రూపాయలతో పునర్నిర్మించనున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే భారతియార్ ఇల్లమ్ పైకప్పు కూలి ఇప్పటికి మూడు నెలలవుతున్నా పునర్నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పైకప్పు కూలిన మరుసటి రోజు ప్రజాపనులశాఖ అధికారులు ఆ భవనం వద్దకు వెళ్ళి కూలిన శిథిలాలను తొలగించి, భవనం ముందువైపు వలలను కట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. భారతీయార్ ఇల్లమ్‌ను చూడాలని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు ఆ భవనం దుస్థితిని చూసి విచారం వ్యక్తం చేస్తున్నారు. భారతియార్ ఇల్లం పునర్నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని మహాకవి భారతియార్ అభిమానులైన కవులు, పండితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ భవనం పునర్నిర్మాణానికి సంబంధించి టెండర్లు, నిర్మాణానికి సంబంధించి శాఖాపరమైన చర్యలు చేపడుతున్నట్లు పాలకపక్షం నుంచి సమాచారం అంది నెలలు దాటినా ఆ భవనం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందాన దుస్థితిలోనే కొట్టుమిట్టాడుతోంది. సెప్టెంబర్ 11న మహాకవి భారతియార్ వర్ధంతి జరుపనున్నామని, ఈలోగా భవనాన్ని పునర్నించాలని సాహితీ వేత్తలు, కవులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్తబుట్టలో జయలలిత ఫొటోలు

● మండిపడ్డ అన్నాడీఎంకే

ప్యారీస్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్‌బోర్డు(టీఎన్‌ఈబీ) జోనల్ కార్యాలయం చెత్తబుట్టలో దివంగత సీఎం జయలలిత ఫొటోలు పడేసిన సంఘటనపై విద్యుత్‌శాఖ మంత్రి చక్రపాణిపై అన్నాడీఎంకే ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈమేరకు ఆపార్టీ తన ఎక్స్‌పేజీలో డీఎంకే ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. 2006లో డీఎంకే ప్రభుత్వం అధికారం ఉన్న సమయంలో చీకటిమయమైన రాష్ట్రానికి వెలుగులునింపిన ఘనత జయలలితకేదక్కుతుందని, అంతటి కీర్తిని సంతరించుకున్న ఆమె ఫొటోలను చెత్తబుట్టలో పడేయటం న్యాయమేనా అని ప్రశ్నించింది. ఇలా చేయడం వల్ల జయ కీర్తిప్రతిష్టలు మరుగున పడవని, రాష్ట్రప్రజలు ఆమె సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని పేర్కొంది.

తిరుప్పూర్‌లో కలకలం... తుపాకులతో ఇద్దరు బిహారీల అరెస్టు

● 300 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం తిరుప్పూర్ కుప్పాండంపాళయంలో వలస కార్మికులు నివసించే ప్రాంతంలో పోలీసులు తనిఖీ చేసి ఓ తుపాకి, 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని బిహార్‌కు చెందిన ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. తిరుప్పూర్ ప్రాంతంలో వందల సంఖ్యలోవున్న బనియన్ ఉత్పత్తి పరిశ్రమల్లో ఉత్తరాది వాసులు పనిచేస్తున్నారు. వీరు రాష్ట్రంలో నిషేధించిన మాదక ద్రవ్యాలను ఉపయోగిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో కుప్పాండంపాళయం ప్రాంతంలో సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఓ తుపాకీ సహా 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి బిహార్‌కు చెందిన జాహీర్ (24), అన్వర్ (25)లను పోలీసులు అరెస్టు చేశారు.

పదవీ విరమణ రోజున డీఎస్పీపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ రోజునే డీఎస్పీ సస్పెన్షన్‌కు గురయ్యారు. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి డీఎస్పీగా పనిచేస్తున్న విజయకుమార్ శాఖాపరమైన పలు ఫిర్యాదులున్నాయి. ఈ క్రమంలో, డీఎస్పీ విజయకుమార్ సోమవారం పదవీ విరమణ చేయనుండగా సస్పెండ్‌కు గురయ్యారు. సస్పెండ్ గురైన కారణంపై ఎలాంటి వివరణ ఇవ్వలేదని సమాచారం.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

తిరుత్తణి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి ప్రాంతంలో గత ఐదు రోజులుగా బీఎస్ఎన్ఎల్ నెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఇంటర్‌నెట్ సేవలపై ఆధారపడిన ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు సహా నెట్ కనెక్షన్లు తీసుకున్న వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇదిలా వుండగా, షాపింగ్‌మాల్స్ పోలీస్‌స్టేషన్లలో అమర్చిన సీసీ కెమెరాలకు నెట్ సౌకర్యం లేనందువల్ల తనిఖీల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్ళి నెట్ ఆగిందని ప్రశ్నించగా, గత కొన్నిరోజులుగా తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు వైర్లను కట్ చేశారని, త్వరలోనే వాటిని బాగుచేస్తామని అధికారులు చెప్పడంతో వినియోగదారులు నిష్క్రమించారు.

డీఎంకే కూటమిలోనే కొనసాగుతాం

● ఎండీఎంకే నిర్వాహక కమిటీ నిర్ణయం

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికల్లో తమ పార్టీకి 12 సీట్లు కేటాయించాలని, డీఎంకే కూటమిలోనే కొనసాగనున్నట్లు నగరంలో ఆదివారం జరిగిన ఎండీఎంకే సమావేశం నిర్ణయించింది. ఎగ్మూర్‌లోని ఎండీఎంకే ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వైగో అధ్యక్షతన జరిగిన సమావేశంలో 38 జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశం 6 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశం అనంతరం వైగో మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల మదురైలో నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడు ద్రావిడ పితామహులు పెరియార్, అన్నాదురై, కరుణానిధిలను కించపరిచిందని, రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా లేరన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా సెప్టెంబర్ 15న తిరుచ్చిలో ఎండీఎంకే మహానాడు భారీస్థాయిలో నిర్వహించనున్నట్లు వైగో తెలిపారు.

ఎ.రాజాకు వ్యతిరేకంగా నేడు బీజేపీ ధర్నా

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను విమర్శించిన డీఎంకే ఎంపీ ఎ.రాజా తీరును ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చెన్నై పరిధిలో ఏడు ప్రాంతాల్లో మంగళవారం ధర్నా చేపట్టనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి కేసుల్లో చిక్కి తీహార్ జైలుకు వెళ్లిన రాజాకు కేంద్ర హోంశాఖ మంత్రిని విమర్శించే అర్హత లేదన్నారు.

మద్యం దుకాణాలు ప్రభుత్వమే నడపాలా?

● హైకోర్టు మదురై బెంచ్ ఆగ్రహం

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడపడంపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకవైపు మందుబాబులను ప్రోత్సహించేలా టాస్మాక్ దుకాణాలను ప్రారంభిస్తూ, మరోవైపు మద్యానికి బానిసలైన వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం సరికాదని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. మదురై కైతరినగర్‌లో కొత్తగా టాస్మాక్ దుకాణం ప్రారంభించకుండా స్టే విధించాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలైన ఓ ప్రజావాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. అప్పుడు విచారణకు హాజరైన రాష్ట్ర ప్రభుత్వం తరుపు న్యాయవాదులను న్యాయమూర్తుల బెంచ్ మద్యానికి సంబంధించి సూటిగా ప్రశ్నించింది. రాష్ట్రంలో రమ్మీ గేమ్‌ను క్రమబద్ధీకరించిన ప్రభుత్వం టాస్మాక్ మద్యం దుకాణాలపై నిర్లక్ష్యం చూపడం సరికాదని అభిప్రాయపడింది. మద్యం దుకాణాలను నడపడం ప్రభుత్వం పనా?, అసలు ఎందుకు ఈ దుకాణాలు నడపాలి? అని ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ దుకాణాలను మూసివేయనున్నట్లు హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ మాటను నిలబెట్టుకోలేకపోయిందని మండిపడింది. ప్రజాసంక్షేమంపై ప్రభుత్వం దృష్టిసారించాలని హితవుపలికింది.

పెద్దనోట్లు మార్చివ్వండి సారూ!

● కోవై కలెక్టర్‌కు వృద్ధురాలి వినతి



పెద్దనోట్లతో వృద్ధురాలు తంగమణి

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాత రూ.1000, రూ.500 నోట్లను మార్చివ్వాలని కోరుతూ కోవై కలెక్టర్‌ను తంగమణి అనే వృద్ధురాలు మొరపెట్టుకుంటున్నారు. జిల్లాలోని సింగానల్లూరు ఉబ్బిలిపాళయం ప్రాంతానికి చెందిన తంగమణి అనే వృద్ధురాలు తన వద్ద ఉన్న రూ.15వేలు విలువైన పాతనోట్లను మార్చివ్వాలని, సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి పెద్దనోట్లతో వెళ్ళి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తన కుమారుడు సెంథిల్‌కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ గుండెపోటుతో హఠాత్తుగా మృతిచెందాడని, అతని మరణం తర్వాత ఇల్లు శుభ్రంచేస్తున్న సమయంలో 5 పాత రూ.1000 నోట్లు, 20 పాత రూ.500 నోట్లు లభించాయని, వాటిని బ్యాంకులో మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఆ తర్వాత నాలుగు సార్లు కోవై కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు. పెద్దనోట్లను మార్చిస్తే ఏదైనా వ్యాపారం చేసి జీవనం సాగిస్తానని తంగమణి వాపోయారు.

డీఎంకే పాలనలో పెరుగుతున్న లాకప్ మరణాలు

● మాజీమంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనలో పన్నుల పెంపులాగే లాకప్ మరణాలు పెరుగుతున్నాయని, అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆర్బీ ఉదయ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శివగంగ జిల్లా మడప్పురం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళిన పోలీసులు దారుణంగా హతమార్చిన సంఘటన ప్రస్తుతం రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలో కూడా వార్తల్లోకి ఎక్కిందని, ఈ నాలుగేళ్ళ డీఎంకే పాలనలో పోలీస్‌స్టేషన్లు హత్యాకేంద్రాలుగా మరాయని అయినప్పటికీ ప్రభుత్వం దీని గురించి సూచించలేదన్నారు. ఇప్పటివరకు 25 మంది విచారణ ఖైదీలు మరణించడంపై జాతీయ మానవహక్కుల కమిషన్ డీఎంకే ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించిందని ఉదయ్‌కుమార్ అన్నారు.

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవదానం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది, ఇన్‌సెట్‌లో ప్రభాకరన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన యువకుడి అవయవాలతో పలువురు పునర్జన్మ పొందారు. తెన్‌కాశి జిల్లా ఆనందపెరుమాళ్ నాడనూరు గ్రామానికి చెందిన షణ్ముగరాజ్ కుమారుడు ప్రభాకరన్ (26) ఈ నెల 27న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, వాహనం ముందు టైర్ పేలింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమైన ప్రభాకరన్‌ను తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం తిరునల్వేలి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో చేర్చారు. ఈ నేపథ్యంలో, 29వ తేది ప్రభాకరన్ మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనతో ప్రభాకరన్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. అవయవాలు దానం చేసి పలువురికి పునర్జన్మ అందించిన ప్రభాకరన్ మృతదేహానికి వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు.

40 శాతం పూర్తయిన గణేష్‌పురం ఫ్లైఓవర్



చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్పాడి ప్రాంతంలో గణేష్‌పురం రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 40 శాతం వరకు పూర్తయినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సుదీర్ఘకాలంగా జరుగుతున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఉత్తర చెన్నైవాసుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు టీకే షణ్ముగం ఇటీవల మేయర్ ఆర్ ప్రియను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు. దీనిపై స్పందించిన కార్పొరేషన్ అధికారులు వివరణనిస్తూ... గణేషపురం ఫ్లైఓవర్ దక్షిణం వైపు స్తంభాల ఏర్పాటు పూర్తయిందని, ప్రస్తుతం ఉత్తర ప్రాంతంలో పునాదులు వేస్తున్నారని, అదే సమయంలో ఆ ప్రాంతంలోని నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి పైప్‌లైన్లను మార్చే పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటికి 40 శాతం పనులు పూర్తయ్యాయని, ఉత్తర దిశగా భూముల స్వాధీనం తర్వాతే నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి పైప్‌లైన్లను మార్చాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో స్థల స్వాధీనం జరిగిన ఆరుమాసాలకు ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆ లేఖలో పేర్కొన్నారు.

నగల వ్యాపారి కిడ్నాప్

● రూ.50 లక్షల విలువైన ఆభరణాల దోపిడీ

● ముఠా కోసం గాలింపు

అడయార్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మోర్‌లో కొందరు దోపిడీ ముఠా సభ్యులు నగల వ్యాపారిని కిడ్నాప్ చేసి రూ.50 లక్షల విలువైన ఆభరణాలు, నగదు దోచుకున్నారు. నగరం నడిబొడ్డున ఎగ్మోర్‌లో ఈ సంఘటన జరగడం కలకలం రేపింది. ఈ దోపిడీకి పాల్పడిన ఆరుగురు ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలిలా... కారైక్కుడికి చెందిన రవి అనే నగల వ్యాపారి చెన్నై నగరానికి అప్పుడప్పుడు వచ్చి బంగారు, వెండి ఆభరణాలను కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. గత నెల 26వ తేదీ నగరానికి వచ్చిన ఆయన... అదేరోజు రాత్రి ప్యారీస్‌లోని ఒక నగల వ్యాపారి వద్ద ఆభరణాలను కొనుగోలుచేశాడు. అక్కడ నుంచి వ్యక్తిగత పనికోసం ఎగ్మోర్ వెళ్ళాడు. అక్కడ పాత పోలీస్‌కమిషనర్ కార్యాలయం రోడ్డులో నగలు, నగదు బ్యాగుతో నిలబడివుండగా, ఆరుగురువ్యక్తులు కారులోరాగా, ముగ్గురు వ్యక్తులు కారు దిగి.. చిరునామా అడిగినట్టు నటించి, ఆ వ్యక్తిని బలవంతంగా కారులో ఎక్కించి, చితకబాదారు. ఆతర్వాత కళ్ళకు గంతలు కట్టి... అరిస్తే చంపేస్తామని బెదిరించారు. కిడ్నాపర్లు ఆ వ్యాపారిని పోరూర్ రామచంద్రా హాస్పిటల్ సమీపానికి తీసుకెళ్ళి, అతని సంచిలో ఉన్న రూ.20 లక్షల విలువచేసే అరకేజీ బంగారు ఆభరణాలు, రూ.30 లక్షల నగదు దోచుకుని వదిలేశారు. దీనిపై ఎగ్మోర్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు రవి ఫిర్యాదుచేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు.. దోపిడీ ముఠాను గాలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. తక్షణ రంగంలోకి దిగిన పోలీసులు.. ఎగ్మోర్ నుంచి పోరూర్ వరకు వ్యాపారిని కిడ్నాప్ చేసిన మార్గంలోని సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

రాందాస్ పదవుల కోసం వెంపర్లాడే నేత కాదు

● పీఎంకే ఎమ్మెల్యే అరుళ్

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఎన్నడూ పదవులను ఆశించలేదని పార్టీ తరుపున పలువురికి పదవులిచ్చి ప్రోత్సహించారని ఎమ్మెల్యే అరుళ్ పేర్కొన్నారు. సేలంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, పీఎంకేలో గత మూడు నెలలకు పైగా ఆధిపత్యపోరు కొనసాగుతోందని అన్బుమణి తన తండ్రిని కించపరచేలా వ్యవహరించడంపై తమలాంటివాళ్లు చూస్తూ ఊరుకోరన్నారు. పీఎంకేకు తల్లి, తండ్రి రాందాస్ మాత్రమేనని, పార్టీ వల్ల లాభం పొందిన అన్బుమణి తండ్రిని విమర్శించడం సరికాదన్నారు. కాగా విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో పీఎంకే సామాజిక కమ్యూనిటీ మీడియా ఫెడరేషన్ సమావేశం ఆదివారం రాందాస్ అధ్యక్షతన జరిగింది. సమాజంలో మార్పు తీసుకొచ్చేలా ప్రభుత్వాలను ప్రశ్నించే స్థాయికి ఎదగాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

లాకప్‌లో మరణించిన అజిత్ ఉగ్రవాదా?

● శివగంగ పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా త్రిభువనం సమీపంలోని మాడపురం కాళియమ్మన్ ఆలయంలో వాచ్‌మన్‌గా పనిచేసి పోలీస్‌స్టేషన్‌లో మరణించిన అజిత్‌కుమార్ ఉగ్రవాదా? అని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ పోలీసులను ప్రశ్నించింది. కాళియమ్మన్ ఆలయంలో కొన్ని రోజుల క్రితం నగలు కనిపించడంలేదనే ఫిర్యాదు ఆధారంగా అజిత్‌కుమార్‌తో పాటు మరికొందిని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. మిగతా వారిని విడిచిపెట్టిన పోలీసులు అజిత్‌కుమార్ మాత్రం అనారోగ్యం కారణంగా లాకప్‌లోనే మరణించినట్లు తెలియజేయడంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు రాస్తారోకో చేశారు. విచారణకు తసుకెళ్ళిన వ్యక్తిపై దాడికి పాల్పడి హతమార్చిన పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేయడంతో ఆరుగురు పోలీసులను జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై మదురై హైకోర్టు బెంచ్ సుమోటోగా ముందుకొచ్చి కేసు నమోదు చేసి సోమవారం విచారణ ప్రారంభించింది. న్యాయమూర్తుల ఎస్ఎం. సుబ్రహ్మణ్యం, మరియా గ్లాడ్ ముందు అన్నాడీఎంకే న్యాయవాదుల సంఘ నిర్వాహకుడు రాజరాజన్, మారీష్‌కుమార్, అరుణ్‌స్వామినాథన్ హాజరై అజిత్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. డీఎంకే పాలనలో ఈ నాలుగేళ్ళలో 24 మంది లాకప్‌లో మరణించిన వారి జాబితాను వారు సమర్పించారు. ఇదిలా వుండగా, పోలీసుశాఖ తరుపున హాజరైన న్యాయవాదులను న్యాయమూర్తుల బెంచ్ ప్రశ్నిస్తూ, వాచ్‌మన్ అజిత్‌కుమార్ ఉగ్రవాదా? అని అతనిపై జరిగిన దాడికి తగిన సమాధానం చెప్పాలని ఉత్తర్వులు జారీచేసింది.

● లైంగిక వేధింపుల కేసు...

టీచర్‌కు ఏడేళ్ల జైలు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడికి న్యాయస్థానం ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ధర్మపురి జిల్లా కు చెందిన వ్యక్తి (54), ఓ ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. ఆయన 2019 నవంబరు 19వ తేది అదే పాఠశాలల్లో 6వ తరగతి చదువుతున్న 10 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. బాధితురాలు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పెన్నాగరం మహిళా స్టేషన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. దీంతో, ధర్మపురి మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఆ ఉపాధ్యాయుడు లొంగిపోయారు. ఈ కేసు విచారణ ముగియడంతో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

● నవ వధువు హత్య వ్యవహారం...

భర్త, అత్త, మామల అరెస్టు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నవవధువు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యవహారంలో భర్త, మామ, అత్తను పోలీసులు జైలుకు తరలించారు. తిరుప్పూర్ జిల్లా అవినాశిపుదూర్ ప్రాంతానికి చెందిన బనియన్ కంపెనీ యజమాని అన్నాదురై, జయసుధ దంపతులకు రిథన్య (27) అనే కుమార్తె ఉంది. బీఎస్సీ చదివిన రిథన్యకు కైకాట్టిపుదూర్ గ్రామానికి చెందిన ఈశ్వరమూర్తి-చిత్రాదేవి దంపతుల కుమారుడు సువిన్‌కుమార్ (29) ఏప్రిల్ 11న వివాహం చేశారు. వివాహం జరిగిన కొద్దిరోజులకే రిథన్యను అత్త,మామ, భర్త వేధించేవారని సమాచారం. ఈ క్రమంలో, ఘటన జరిగిన రోజున ఇంటి నుంచి కారు నడుపుతూ వెళ్లిన రిథన్య, సెట్టిపుదూర్ ప్రాంతంలో కారు ఆపి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సేవూరు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో, తనను మానసికంగా, శారీరకంగా అత్తామామలు వేధించారంటూ రిథన్య తెలిపిన ఆడియో వాట్సాప్ ద్వారా ఆత్మహత్యకు ముందే పంపినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు మృతురాలి భర్త సువిన్‌కుమార్, మామ ఈశ్వరమూర్తి, అత్త చిత్రాదేవిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రైల్వే స్టేషన్లలో విద్యార్థుల రగడ

● మూడేళ్లలో 158 కేసులు నమోదు

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్‌లో ఘర్షణలకు పాల్పడడం, ప్రయాణికులను భయభ్రాంతులను చేసేలా వికృత చేష్టలు చేసిన విద్యార్థులపై మూడేళ్లలో 158 కేసులు నమోదుచేసి, 127 మందిని అరెస్ట్ చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నగరం చుట్టుపక్కల జిల్లాలకు చెందిన విద్యార్థులు నగరంలోని పలు కళాశాలల్లో చదువుతూ సబర్బన్ రైళ్లలోనే కళాశాలలకు వస్తుంటారు. ఈ విద్యార్థులు తరచూ గొడవలకు పాల్పడున్నారు. విద్యార్థుల ఆగడాలు అడ్డుకొనేలా రైల్వే పోలీసులతో రైల్వేస్టేషన్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలా ఘర్షణలకు పాల్పడిన ఘటనల్లో 2023 నుంచి ఈ ఏడాది వరకు 158 కేసులు నమోదుచేసి 127 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఫ్లాట్‌ఫారం దాటి నిలిచిన రైలు

పెరంబూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫారం నుంచి 200అడుగుల దూరంలో రైలు ఆగడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. పుదుచ్చేరినుంచి చెన్నై బీచ్ వస్తున్న మెము రైలు సోమవారం ఉదయం త్రిశూలం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కానీ, రైలు స్టేషన్‌లో ఆగకుండా వెళ్తుండడంతో ప్రయాణికులు కేకలు వేశారు. దీంతో, ఫ్లాట్‌ఫారం నుంచి 200 అడుగుల దూరంలో డ్రైవర్ రైలు నిలిపివేశాడు. దీంతో, మెట్లు లేని సబర్బన్ రైలు నుంచి ప్రయాణికులు కిందకు దూకి రైలు పట్టాల మధ్య నడుచుకుంటూ స్టేషన్‌కు చేరుకున్నారు. దీనిపైవిచారణకు ఆదేశించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



విజయ్ సేతుపతి - నిత్యా మేనన్

25న 'తలైవన్ - తలైవి' రిలీజ్

విజయ్ సేతుపతి - నిత్యా మేనన్ జంటగా నటించిన తాజా చిత్రం 'తలైవన్ - తలైవి' వచ్చే నెల 25వ తేదీ విడుదలకానుంది. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో యోగిబాబు, ఆర్కే సురేష్, సెంబియన్ వినోద్ తదితరులు ఇతరపాత్రలను పోషించారు. సత్యజ్యోతి ప్రొడక్షన్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం సంతోష్ నారాయణన్. త్వరలోనే ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేసి మూవీ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించాలని చిత్ర బృందం భావిస్తోంది. ఓ మధ్య తరగతి కుటుంబంలోని భార్యాభర్తలుగా నిత్యామీనన్, విజయ్ సేతుపతి ఎంతో సహజంగా నటించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో వారి కెమిస్ట్రీపై ప్రతి ఒక్కరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రాన్ని జూలై 25వ తేదీన విడుదల చేయనున్నట్టు నిర్మాతలు అధికారికంగా వెల్లడించారు.



'ది బ్లాక్ బైబిల్'లో ఓ దృశ్యం

సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'ది బ్లాక్ బైబిల్'

తమిళ చిత్రపరిశ్రమలో ప్రస్తుతం కొత్త ట్రెండ్ సాగుతోంది. హార్రర్, థ్రిల్లర్ జోనర్‌లో అధిక సంఖ్యలో చిత్రాలు వస్తున్నాయి. ఆ కోవలోనే సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీగా 'ది బ్లాక్ బైబిల్' అనే పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. కొత్త తరహా థ్రిల్లర్ అనుభవాన్ని కలిగించేలా తెరకెక్కిస్తున్నారు. సాధారణంగా దెయ్యం చిత్రాలు పగ, ప్రేమ, ప్రతీకారంతో నిర్మిస్తుంటారు. ఈ చిత్రాన్ని మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా డెబ్యూ డైరెక్టర్ మణికంఠన్ రూపొందిస్తున్నారు. 'సుళల్-ది వోర్టెక్స్' అనే వెబ్ సిరీస్‌లో అద్భుతమైన నటనతో ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకున్న చాందిని తమిళరసన్, శ్రీజా రవి, మోనా బెత్రా, ఐరా పాలక్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించగా, ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తమిళనాడు - కేరళ సరిహద్దుల్లో ఉన్న హస్తినాపురం అనే గ్రామ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మణికంఠన్ మాట్లాడుతూ, 'వలసరాజ్యాల కాలం నాటి మంత్రవిద్యల కారణంగా శాపగ్రస్తల భూమి భారి నుంచి తప్పించుకునేందుకు పోరాడే ఇద్దరు స్త్రీల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. వీరిద్దరితో పాటు ఓ ప్రేమికుడు దెయ్యాల బారిన పడి వారు ఎదుర్కొనే ఆశ్చర్యకరమైన, భయానక సన్నివేశాలతో ఈ సినిమాను రూపొందించాం' అని పేర్కొన్నారు. ఈపీఎస్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల చేయనున్నారు.



చిత్రజ్యోతి

దర్శకుడిగా ఎస్‌జే సూర్య రీఎంట్రీ

ఒకపుడు దర్శకుడుగా ఎన్నో హిట్ చిత్రాలు అందించిన ఎస్‌జే సూర్య మళ్ళీ మెగా ఫోన్ పట్టుకోనున్నారు. ఆయన హీరోగా నటిస్తూనే దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్లర్' అనే పేరుతో రూపొందించే ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు తాజాగా జరిగాయి. దీనికి ప్రముఖ హీరో కార్తి ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌జే సూర్యను అభినందించారు. ప్రస్తుతం నటుడిగా ఎస్‌జే సూర్య వరుస అవకాశాలతో ఎంతో బిజీగా ఉన్నారు. అజిత్ నటించిన 'వాలి' చిత్రంలో దర్శకుడిగా వెండితెరకు పరిచయమై, తన తొలి చిత్రంలోనే దక్షిణాది సినీ ప్రేక్షకులను తన వైపు తిప్పుకున్నారు. ఆ తర్వాత విజయ్ హీరోగా నటించిన 'ఖుషి' చిత్రంతో దర్శకుడిగా తన సత్తా చాటుకున్నారు. పాన్ ఇండియా అనే పదం పరిచయం కాకముందే ఈ చిత్రాన్ని పలు భాషల్లో రీమేక్ చేసి దేశంలోని పలు భాషల్లో రిలీజ్ చేశారు. రెండు బ్లాక్ బస్టర్ విజయాల తర్వాత ఎస్‌జే సూర్య 'న్యూ' అనే చిత్రంలో నటుడుగా అరంగేట్రం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో వైవిధ్యభరితమైన కథా పాత్రల్లో నటించారు. ఈ క్రమంలో దర్శకత్వ బాధ్యతలకు గత కొంతకాలంగా దూరంగా ఉన్న ఇపుడు మళ్ళీ దర్శకత్వం వైపు మొగ్గు చూపారు. వినోదం, కమర్షియల్, లవ్, డ్రామా, థ్రిల్లర్ ఇలా అన్ని అంశాలతో 'కిల్లర్' మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో ప్రీతి అస్రానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ గోకులం మూవీస్ గోపాలన్, ఏంజెల్ స్టూడియోస్ ఫిల్మ్ కంపెనీ సహకారంతో నిర్మించే ఈ చిత్రాన్ని మెక్సికోలో చిత్రీకరించనున్నారు. ఇందులో నటించే తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించన్నారు.



ఎస్‌జే సూర్యను అభినందిస్తున్న కార్తి



గ్లామర్‌కు దూరంగా నిమిషా విజయన్

కోలీవుడ్‌లోని యంగ్ హీరోయిన్ నిమిషా విజయన్ గ్లామర్‌కు ఆమడదూరంలో ఉంటూ వరుస అవకాశాలను దక్కించుకుంటున్నారు. తాజాగా నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వంలో వచ్చిన 'డీఎన్ఏ' మూవీలో ఆమె డీగ్లామరస్ పాత్రలో నటించి శెభాష్ అనిపించుకున్నారు. తమిళ చిత్రపరిశ్రమలో కొన్నేళ్ళుగా కొనసాగుతున్నప్పటికీ ఎక్స్‌పోజింగ్, గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటున్న హీరోయిన్‌గా నిమిషా గుర్తింపుపొందారు. ఆమె నటించిన 'చిత్తా', 'జిగర్‌తండా డబుల్ ఎక్స్', 'డీఎన్ఏ' చిత్రాలు ఘన విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఈ మూడు సినిమాల్లో ఆమె ఎక్స్‌పోజింగ్‌కు దూరంగా ఉండటం గమనార్హం. అదేసమయంలో మంచి కథా చిత్రాల్లో నటించేందుకు తాను సిద్ధమని, తనకు అవకాశాలు ఇవ్వాలని ఆమె సిగ్గు విడిచి కోతున్నారు.

అరుప్పుకోట ఆలయానికి మర ఏనుగు

● కానుకగా సమర్పించిన నటి త్రిష

టి.నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి త్రిష అరుప్పుకోట ఆలయానికి రూ.6లక్షల విలువైన మర ఏనుగును కానుకగా సమర్పించారు. చూడటానికి నిజమైన పట్టపుటేనుగులా తయారైన ఈ గజం భక్తులను తొండంతో ఆశీర్వదిస్తుంది. తొండం నుండి నీటిని వేగంగా చిమ్మగలుగుతుంది. తన చెవులను, తోకను ఆడిస్తుంది. విరుదునగర్ జిల్లా అరుప్పుకోట వీరలక్ష్మీనగర్‌లో అష్టలింగ ఆదిశేష సెల్వ వినాయకుడు, అష్టభుజ ఆదిశేష వారాహి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం జూలై 2న జరుగనుంది. దానిని పురస్కరించుకుని ఆ ఆలయానికి పట్టపుటేనుగును తలపించేలా తయారైన భారీ మర ఏనుగును సినీనటి త్రిష, చెన్నైకి చెందిన పీపుల్ ఫర్ కెటిల్ ఇన్ ఇండియా సంస్థ నిర్వాహకులతో కలిసి కానుకగా అందించారు. ఆ మర ఏనుగుకు 'గజా' అనే నామకరణం కూడా చేశారు. ఈ యంత్రపుటేనుగును నటి త్రిష తరపున డీఎస్పీ మదివానన్, పీపుల్ ఫార్ కెటిల్ ఇన్ ఇండియా నిర్వాహకులు ఆలయానికి కానుకగా సమర్పించారు. ఈ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ కేరళలోని ఓ ఆలయానికి ప్రపంచంలోనే మొదటిసారి 'ఇరింజాటపిల్లి రామన్' పేరుతో యంత్ర పుటేనుగును రూపొందించి ఇచ్చామని తెలిపారు. తమిళనాట ప్రప్రథమంగా అరుప్పుకోట ఆలయానికి రూ.6 లక్షల విలువైన ఈ యాంత్రిక పట్టపుటేనుగును కానుకగా సమర్పించినట్లు వివరించారు. ఈ మర ఏనుగు ఆలయ క్రతువుల్లోనూ పాల్గొంటుందన్నారు. తమిళనాట 29 ఆలయాల్లో ఏనుగులను సంరక్షిస్తున్నారని చెబుతూ ఆ ఆలయాల్లో ఇలాంటి యంత్రపుటేనుగులను ఉపయోగించడం సముచితంగా ఉంటుందని, జంతు హింసకు స్వస్తి చెప్పవచ్చునని పేర్కొన్నారు.



మర ఏనుగుకు ఇరువైపులా మావటీల వేషంలో నిలిచిన ఆలయ సిబ్బంది

సెప్టెంబర్ నాటికి కిలాంబాక్కం రైల్వేస్టేషన్ ప్రారంభం



ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన కిలాంబాక్కంలో నిర్మిస్తున్న కొత్త రైల్వేస్టేషన్ సెప్టెంబర్‌లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని హిందూ దేవాదాయశాఖ మంత్రి, సీఎండీఏ చైర్మెన్ పీకే శేఖర్ బాబు పేర్కొన్నారు. రాజధాని నగరం చెన్నైలో వాహనాల రద్దీని నియంత్రించేలా శివారు ప్రాంతమైన వండలూరు సమీపంలోని కిలాంబాక్కంలో సీఎండీఏ కొత్తగా బస్ టెర్మినల్‌ను ప్రారంభించింది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు బస్సులు నడుపుతున్నారు. ఇక్కడి వెళ్ళే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికుల విశ్రాంతి గది, టిక్కెట్ కౌంటర్లు, స్టేషన్ మేనేజర్, అధికారుల కార్యాలయాలు, రైలు పట్టాల నిర్మాణం పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, కూత్తంబాక్కంలో నిర్మిస్తున్న బస్ టెర్మినల్‌ను సోమవారం మంత్రి శేఖర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూత్తంబాక్కం బస్ టెర్మినల్‌ను సీఎండీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బస్ టెర్మినల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నవంబర్‌లోని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్ ప్రారంభించిన సమయంలో ఉన్న కొన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. కిలాంబాక్కంలోని రైల్వేస్టేషన్ నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయని, సాధ్యమైతే ఆగస్టులో కానీ, సెప్టెంబర్‌లో గాని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మాధవరం బస్ టెర్మినల్ సమీపంలో మెట్రోరైలు పనులు జరుగుతున్నందున అక్కడి నుండి అధిక బస్సులను దక్షిణ జిల్లాలకు నడపలేని పరిస్థితి నెలకొందని, మెట్రో పనులు పూర్తయ్యాక ఈ సమస్యను కూడా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.



ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

నెల్లయప్పర్‌లో ఆణి ఉత్సవాలు ఆరంభం

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం కాంతిమతి సమేత నెల్లయప్పర్ ఆలయంలో సోమవారం ఉదయం ఆణి ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ధ్వజారోహణం సందర్భంగా వేకువజాము నాలుగు గంటలకు మూలవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామండపంలో యాగశాల పూజలు చేసి, ధ్వజస్థంభ ప్రాంతంలో సర్వాలంకరణతో స్వామి, అమ్మవారు వేంచేశారు. ఆలయ ప్రధానార్చకులు, శైవపండితులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రధానార్చకులు ధ్వజారోహణం చేశారు. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లు వివిధ వాహనసేవల్లో పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం జూలై 8న కనుల పండువగా నిర్వహించనున్నారు.

డబ్ల్యూఎంటీబీసీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన కమిటీ మోహన్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు

ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు కుక్స్‌రోడ్డులో 136యేళ్ళ చరిత్రగల వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ (డబ్ల్యూఎంటీబీసీ) 2025-2026వ సంవత్సరానికి గాను నూతన కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. ప్రభుత్వ విధివిధానాల మేరకు గత నెల 22న రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఇందులో లేబాకు మోహన్‌కుమార్ (అధ్యక్షుడు), పదర్ల శామ్‌సన్ (ఉపాధ్యక్షుడు), గౌడిపేరు నాగేశ్వరరావు (ప్రధాన కార్యదర్శి), డీజే.ఎషియాబాబు (ఉప కార్యదర్శి), బండారు జీవన్‌బాబు (కోశాధికారి)గా ఎన్నికయ్యారు. వీరితో పాటు స్టాండింగ్ కమిటీ తదితరులతో సంఘ సీనియర్ పాస్టర్ రెవ.డా ఎం.పాల్ ఈశ్వరప్ప ప్రమాణం చేయించారు.. అసిస్టెంట్ పాస్టర్లు రెవ.ఆరోన్‌దయాన్, రెవ.పి.మధన్‌మోహన్ సహా యువజన విభాగం, స్త్రీల సంఘం, క్వయర్ సండే స్కూల్ నిర్వాహకులు, సంఘ సభ్యులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, చర్చి తరుపున సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సభ్యుల సమష్టి కృషితో ముందుకు తీసుకెళ్ళేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

వీరప్పన్‌కు స్మారక మండపం నిర్మించండి

● భార్య ముత్తులక్ష్మి డిమాండ్

టి.నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చందనం చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్మారక మండపం నిర్మించాలని అతడి భార్య, తమిళగ వాళ్వురిమై కట్చి రాజకీయ కమిటీ సభ్యురాలు ముత్తులక్ష్మి విజ్ఞప్తి చేశారు. దిండుగల్ సమీపం చిన్నాలపట్టిలో జరిగిన ఓ వివాహ వేడుకకు వచ్చిన మంత్రి ఐ. పెరియసామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తన భర్త వీరప్పన్‌ను ఖననం చేసిన ప్రాంతం వద్దే రాష్ట్ర ప్రభుత్వం స్మారకమండపం నిర్మించాలని, తన అభ్యర్థనను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలియజేయమంటూ ఆమె మంత్రి పెరియసామిని కోరారు. ఆ తర్వాత వివాహ వేడుక సభలో ముత్తులక్ష్మి ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రస్తుతం రానున్నది మా అధికారమే అంటూ పలువురు పగటికలలు కంటున్నారని, సినిమాలో హీరోయిన్లతో డ్యాన్స్‌లు చేసి కోట్లు గడించిన తర్వాత కాబోయే ముఖ్యమంత్రి తానేనని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని, అలాంటివారి దుష్ప్రచారాలను డీఎంకే కూటమి పార్టీల నాయకులంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉత్తరాది యువత వలస వచ్చి స్థానికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఈ పరిస్థితి మారాలని కోరారు. శ్రీలంకలో తమిళులను మట్టుబెట్టి సింహాళీయులు ఆదేశాన్ని ఎలా పరిపాలిస్తున్నారో ఆ విధంగానే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలంతా రాష్ట్రంలో రాజకీయ పార్టీలను నాశనం చేసి అధికారంలోకి రావాలని అనుకుంటున్నారని ముత్తులక్ష్మి ఆరోపించారు.



మంత్రి పెరియసామిని కలుసుకున్న ముత్తులక్ష్మి



172 మంది పోలీసులకు పదోన్నతి

అడయార్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పనిచేస్తున్న 21 మంది ఫస్ట్‌గ్రేడ్ కానిస్టేబుళ్ళకు హెడ్ కానిస్టేబుళ్ళగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. అలాగే వైద్య శాఖలో కొత్తగా నియమితులైన 172 మందికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

మరుదమలైలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



ప్యారీస్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలో మరుదమలైలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కోవైలోని ఓ ఆస్పత్రిలో రాజ్‌నాథ్‌సింగ్ సతీమణి అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఇటీవల మంత్రి కుమార్తె, అల్లుడు మరుదుమలై సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత తన సతీమణిని పరామర్శించేందుకు రాజ్‌నాథ్‌సింగ్ ఆదివారం న్యూఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో కోయంబత్తూరు చేరుకున్నారు. ఆస్పత్రిలో సతీమణిని పరామర్శించిన అనంతరం సాయంత్రం 6.15 గంటలకు మరుదుమలై ఆలయానికి వెళ్ళారు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కి అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఆదిమూలస్థానంలో మురుగన్ దర్శనం చేసుకున్న అనంతరం పంచముఖ వినాయకుడిని సేవించారు. ఆ తర్వాత మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామి దర్శనం చేసుకున్న మంత్రి సాయంత్రం 6.45 గంటలకు ఆలయం నుంచి బయలుదేరారు. కేంద్రరక్షణశాఖ మంత్రి పర్యటక సందర్భంగా కోయంబత్తూరు పట్టణం, ఆయన ప్రయాణం చేసిన మార్గాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

డిగ్రీ కాలేజీల్లో ఫస్ట్‌ఇయర్ క్లాసులు ప్రారంభం

● ఘనంగా ఆహ్వానించిన సీనియర్లు, లెక్చరర్లు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో ఫస్ట్‌ఇయర్ క్లాసులు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ సైన్స్ కళాశాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మే 7 నుంచి 27 వరకు కొనసాగింది. రెండు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. ఈ నేపథ్యంలో ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో సోమవారం ఉదయం తరగతులు ప్రారంభమయ్యాయి. పలు కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్లు, లెక్చరర్లు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అధ్యాపకులు వారికి పూలమాలలు వేసి, మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. మరికొన్ని కళాశాలల్లో తొలిసారిగా ప్రాంగణంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు జానపద కళాకారులతో సిలంబాట్టం, కరగాట్టం వంటి నృత్యాలను ప్రదర్శింపజేసి ఘనంగా స్వాగతం పలికారు.



నగరంలోని ఓ కళాశాలలో జానపద నృత్యంతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

తిరుత్తణి మురుగన్ సేవలో ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర

తిరుత్తణి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం ఉదయం తిరుత్తణి మురుగన్ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం సుభిక్షంగా ఉందని, ప్రజా సంక్షేమం కోసం తమ పార్టీ ఎల్లప్పుడూ పాటుపడుతుందని, దీనికి భగవంతుని ఆశీస్సులు కూడా తోడుండాలని తిరుత్తణి క్షేత్రానికి వచ్చానన్నారు. ఇదిలా వుండగా, మంగళవారం షణ్ముఖ షష్ఠి కారణంగా ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువైంది.



తిరుత్తణి ఆలయంలోకి వెళ్తున్న మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

రెహ్మాన్‌తో రాజకీయాలు మాట్లాడలేదు

బీజేపీలోకి మీనా వస్తే స్వాగతిస్తాం ● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో రాజకీయాల కోసం మాట్లాడలేదని, నటి మీనా బీజేపీలోకి వస్తే స్వాగతిస్తామని కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత ఎల్.మురుగన్ తెలిపారు. తిరుచ్చిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ఓటమి భయంతోనే అధికారం సాగిస్తుందన్నారు. ఎన్డీఏ విజయంతో డీఎంకేను ఇంటికి సాగనంపనున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనారహిత్యంతోనే లాకప్ మరణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు లెక్కచేయడం లేదని విమర్శించారు. శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా ఫలితం లేదన్నారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో సమావేశం కావడంపై మీడియా అడిగిన ప్రశ్నకు... ఆ శాఖ మంత్రిగా సంగీత దర్శకుడు రెహ్మాన్ స్టూడియోను తాను వీక్షించానని, ఆయనతో రాజకీయాలపై మాట్లాడలేదని కేంద్ర మంత్రి మురుగన్ స్పష్టం చేశారు.





‘హరిహర వీరమల్లు’లో పాట పాడా

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నటించిన ‘హరిహర వీరమల్లు’ చిత్రంలో ‘కొల్లగొట్టి నాదిరో’ అనే ఓ పాట పాడానని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సినిమా పాటలతో పాటు దేవుడి పాటలూ పాడుతున్నట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాగే, సినీహీరో మాధవన్, నటి వాసుకి, మహారాష్ట్ర మంత్రి ప్రకాష్ అంబేద్కర్ తదితరులూ శ్రీవారిని దర్శించుకున్నారు.



రాహుల్ సిప్లిగంజ్ - మాధవన్



వాసుకి


శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,497

తలనీలాలు సమర్పించినవారు: 29,054





నాసిరకం యంత్రాలు కొన్న వారిపై కేసు పెట్టాలి

టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ డిమాండ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసేందుకు గత పాలకవర్గంలో మూడు నాసిరకం మిషన్లను కొన్నారని ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తుల సొమ్మును గత వైసీపీ పాలకులు నాసిరక మిషన్ల పాలు చేశారని విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసే మూడు మిషన్లను రూ.4కోట్లకు కొన్నారన్నారు. వీటిలో ఒకటి కాలిపోగా, మరో దానిలో మందుల పొడి బయటకు వస్తుందన్నారు. ఇంకో దానికి బోల్టులు ఊడిపోతున్నాయన్నారు. తమ పరిశీలనలో ఆ మిషన్లు సెకండ్‌హ్యాండ్‌విగా గుర్తించామన్నారు. వీటిని హైదరాబాద్‌లోని చిన్న రేకుల షెడ్‌లో ఉన్న సాయి తేజ స్టీల్‌కార్పొరేషన్ సప్లై చేసినట్లు తెలిసిందన్నారు. భక్తుల సొమ్ము రూ.4కోట్లను వృథా చేసి నాసిరకం మిషన్లు కొన్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. వెంకటేశ్వరస్వామి సొత్తు తిన్నందుకే 11 సీట్లు ఇచ్చారన్నారు. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ వాయిదా

చిత్తూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీల కౌన్సెలింగ్ వాయిదా పడింది. చిత్తూరులో సోమవారం 449 మందికి చిత్తూరు పీఆర్ ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది. సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల బదిలీలను వాయిదా వేశారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీ రాజుగుంటహరిజనవాడలోని పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు కోరారు. 50 సంవత్సరాలుగా గ్రామంలో ఉన్న పాఠశాలను మన్నవరం స్కూల్లో విలీనం చేశామని, పిల్లలను అక్కడికి పంపాలని చెప్పడం బాధాకరమన్నారు. తమ గ్రామంలో పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు వజ్రమ్మ, సావిత్రమ్మ, సుబ్రహ్మణ్యం, నాగరాజు, జయచంద్ర కోరారు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన ● పీజీఆర్‌ఎస్‌కు 296 వినతులు ● అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. 296 వినతులు అందగా 145 రెవెన్యూ సంబంధితమైనవే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది సాధువులు వచ్చి అధికారులను ఆశీర్వదించి వెళ్లారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు పంచాయతీ యాదవ్‌కాలనీలో ఉండే రజకుల స్థలాన్ని పంచాయతీ అధికారి ఆక్రమించి కంచె వేయడం దుర్మార్గమన్నారు. 2014లో ప్రభుత్వం రజకులకు 50 సెంట్లు కేటాయించిందన్నారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వమే తొట్టెలు, బోర్లు వేయించనట్లు చెప్పారు. ఆ స్థలం చుట్టూ కంచె వేయడం దుర్మార్గమని, వెంటనే దాన్ని తొలగించాలని కోరారు. జిల్లా నాయకులు చిన్నబాబు, పుల్లయ్య, శివయ్య, సురేంద్ర, మునెప్ప, చంద్రశేఖర్, చంద్రబాబు, కోమల, కుసుమ, భూదేవి పాల్గొన్నారు.

తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇస్తున్నారు..

రెవెన్యూ సమస్యలు పరిష్కారమైనట్లు తప్పుడు ఎండార్స్‌మెంట్ ఇస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ గత డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 15,264 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారని, అందులో ఎక్కువ భాగం పరిష్కారం కాకనే అయినట్లు అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఇలాంటి తప్పుడు నివేదికలపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడండి

నాయుడుపేటలో మినీ ట్రక్ వ్యాన్‌లకు సంబంధించిన పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు జయచంద్ర, శివ, ముకుంద మాట్లాడుతూ నాయుడుపేట పంచాయతీగా ఉన్న సమయంలో ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న స్థలంలో ట్యాక్సీలు ఆపుకునేవారన్నారు. కాంప్లెక్స్ కట్టాలని ఖాళీ చేయమనడంతో పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో స్టాండ్ పెట్టుకున్నారన్నారు. 2019లో అన్న క్యాంటీన్ ఏర్పాటు పేరుతో దాన్ని ఖాళీ చేయించి అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న స్థలంలో పెట్టుకోవాలని సూచించారన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా ఖాళీ చేయమని మున్సిపల్ కమిషనర్ చెప్పడం బాధాకరమన్నారు. ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. గిరి, మస్తాన్‌రెడ్డి, హేమంత్, రమణయ్య, అమీర్, చెంచుకుప్పయ్య, జిలానీ, సతీష్ పాల్గొన్నారు.



ఫైనాన్స్ బిల్లులో లోపాలను సవరించండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫైనాన్స్ బిల్లులో లోపాలని సవరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేఆర్ శంకర్, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ ఈ బిల్లులో భవిష్యత్తులో పెన్షనర్ల బేసిక్ పే పెంపుదల ఉండదని చెప్పడం బాధాకరమన్నారు. దీనిపై ఆందోళనలు చేస్తుండగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కంటితుడుపు ప్రకటనలు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. పే రివిజన్ చేసినపుడు విశ్రాంత ఉద్యోగులకు బేసిక్ పే పెంపుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సర కాలంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలూ కల్పించలేదని తెలిపారు. పెండింగ్ డీఏలను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధయ్య, పాపయ్య, మునికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్స్ సమస్యలు పరిష్కరించండి

టూరిజం శాఖలో పనిచేస్తున్న లోకల్ గైడ్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 1996లో టూరిజం ప్యాకేజీల్లో భాగంగా తిరుమలలో ప్రత్యేక దర్శనాలు కల్పించారని తెలిపారు. తద్వారా లోకల్ గైడ్లకు జీవనోపాధి దొరికిందన్నారు. అయితే కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడ్డారనే నెపంతో గత ప్రభుత్వం టూరిజం కార్పొరేషన్లకు ఉన్న ప్రత్యేక దర్శనాలను రద్దు చేసిందని చెప్పారు. తద్వారా తిరుపతిలో ఉన్న సుమారు వందమంది లోకల్‌గైడ్స్ కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. వెంటనే వారికి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి గైడ్ యూనియన్ నాయకులు పెదిరెడ్డి, చంద్రమౌళి, నాగభూషణం, సురేష్, వెంకటేష్, శివ, ఏకాంత, శ్రీకాంత్, రాము, హరి పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం ‘కె-ర్యాంప్’. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి ‘తల్లి మనసు’



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం ‘తల్లి మనసు’. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ “సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది” అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

\- శ్రీరామ్ వేణు



“తమ్ముడు’ సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం’ అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘తమ్ముడు’. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ ‘ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. ‘విక్రమ్’లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. ‘తమ్ముడు’లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. ‘కాంతారా’ చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో ‘తమ్ముడు’ కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫీమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను’ అని అన్నారు.

అల్లరి నరేశ్ ‘ఆల్కహాల్’



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. ‘ఫ్యామిలీ డ్రామా’ ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు ‘అల్కహాల్’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.



